Goad Se Goar Tak
(Telugu)

ఒడి నుండి సమాధి వరకు

రచన

మౌలానా ముహమ్మద్ అసద్ ఇస్రాయిలీ

తెలుగు అనువాదం

ఇఖ్బాల్ అహ్మద్

విషయ సూచిక

అనంతకరుణామయుడు అపారకృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

పరిచయం

'ఇస్లాం' పూర్తి జీవితానికి సంబంధించిన ధర్మం. పుట్టినప్పటి నుండి గిట్టే వరకు ముస్లింలు ఇస్లాం ఆదేశాలను ఆచరించాలని, ఇస్లాం సంప్రదాయాలకు అంటిపెట్టుకుని వుండాలని ఆజ్ఞాపించడం జరిగింది.

"వ లాతమూతున్న ఇల్లా వ అన్తుమ్ ముస్లిమూన్"
ముస్లిములుగా ఉన్న స్థితిలో తప్ప మీకు చావురాకూడదు.

ఇస్లామీయ సమాజానికి ఎన్నో ప్రత్యేకతలున్నాయి. మానవ జీవితం కోసం ఎన్నో విధానాలు నిర్ణయించబడ్డాయి. వాటన్నిటిని పాటించడం ద్వారానే ముస్లిం జీవితం సార్థకమవుతుంది. ఈ చిరు పుస్తకంలో ఇటువంటివే కొన్ని ఇస్లామీయ విధానాలు, ఆదేశాలు వివరంగా మీకు లభిస్తాయి. ఇవి ఇస్లామీయ జీవితాన్ని ఇస్లామేతర జీవితం నుండి వేరుచేసి ప్రస్ఫుటం చేస్తాయి. ఒక సాధారణ ముస్లిం సులువైన పద్ధతిలో తనకు రాత్రింబవళ్ళలో అవసరమైన విషయాలు తెలుసుకోవాలన్నదే దీని ఉద్దేశ్యం. ఉదాహరణకు పిల్లవాడు పుట్టగానే అతడి చెవిలో అజాన్ పలకడం, పేరు పెట్టడం, అఖీఖా చేయడం, ఖత్నా చేయడం, అతడు పెద్దవాడయిన తర్వాత పెళ్ళి చేయడం వగైరా. ఇదే విధంగా చనిపోయినప్పుడు, ఆ తర్వాత ఎదురయ్యే ఎన్నో ఇతర సమస్యలు ప్రతి మనిషికీ ఎదురవుతాయి. ఉదాహరణకు శవానికి స్నానం (గుసుల్) చేయించడం, కఫన్ (వస్త్రం తొడిగించడం), జనాజా నమాజ్, పూడ్చి పెట్టడం వగైరా. ఈ సందర్భాలన్నింటిలో ముస్లిమేతరుల ఆచారాలకు భిన్నంగా ఒక ముస్లిం చేయవలసిన పనులు ఏమిటో తెలుసుకోవడం ప్రతి ముస్లింకూ తప్పనిసరి. ఈ పుస్తకంలో దీనికి అవసరమయిన వివరాలన్నీ అందించే ప్రయత్నం జరిగింది. ఈవిధంగా ఈ పుస్తకం ఇన్షాఅల్లాహ్ ఎంతో ప్రయోజనకారి కాగలదని ఆశిస్తున్నాము. ఇది ప్రతి ఇంటా ఉండవలసిన పుస్తకం.

- అబూసలీం ముహమ్మద్ అబ్దుల్ హై
రచయిత

పుట్టుక

శిశువు పుట్టిందని కబురు విని అల్లాహ్‌కు కృతజ్ఞత చెల్లించాలి. మగ పిల్లవాడయినా, ఆడపిల్లయినా అల్లాహ్ ప్రసాదించిన భాగ్యమే. అమ్మాయి పుట్టిందని తెలిసి విచారించడం ఎంతో చెడ్డ విషయం. అలాచేస్తే అల్లాహ్‌కు ఆగ్రహం కలుగుతుంది.

పిల్లవాడు పుట్టగానే అతడి కుడి చెవిలో అజాన్ వాక్యాలు, ఎడమ చెవిలో ఇఖామత్ వాక్యాలు పలకడం సున్నత్ (ప్రవక్త సంప్రదాయం). అజాన్, ఇఖామత్ వాక్యాల అనువాదం క్రింద ఇవ్వబడుతోంది:

అజాన్ వాక్యాలు

"అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్" : (అల్లాహ్ ఎంతో గొప్పవాడు, అల్లాహ్ ఎంతో గొప్పవాడు.)

"అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్" : (అల్లాహ్ ఎంతో గొప్పవాడు, అల్లాహ్ ఎంతో గొప్పవాడు.)

"అష్‌హదు అన్‌ల్లాయిలాహ ఇల్లల్లాహ్" : (అల్లాహ్ తప్ప మరెవరూ ఆరాధ్యులు లేరని నేను సాక్ష్యమిస్తున్నాను.)

"అష్‌హదు అన్‌ల్లాయిలాహ ఇల్లల్లాహ్" : (అల్లాహ్ తప్ప మరెవరూ ఆరాధ్యులు లేరని నేను సాక్ష్యమిస్తున్నాను.)

"అష్‌హదు అన్న ముహమ్మదర్ రసూలుల్లాహ్,

అష్‌హదు అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్" : (ముహమ్మద్, అల్లాహ్ ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను. ముహమ్మద్, అల్లాహ్ ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను.)

"హయ్యా అలస్సలాహ్, హయ్యా అలస్సలాహ్" : (నమాజ్ వైపుకు రండి! నమాజ్ వైపుకు రండి!)

"హయ్యా అలల్ ఫలాహ్, హయ్యా అలల్ ఫలాహ్" : (సాఫల్యం వైపునకు రండి! సాఫల్యం వైపునకు రండి!)

"అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్" : (అల్లాహ్ ఎంతో గొప్పవాడు, అల్లాహ్ ఎంతో గొప్పవాడు.)

"లా ఇలాహ ఇల్లల్లాహ్" (అల్లాహ్ తప్ప మరెవరూ ఆరాధ్యులు లేరు.)

ఇఖామత్

అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్. అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్ అష్హదు అన్లాయిలాహ ఇల్లల్లాహ్, అష్హదు అన్లాయిలాహ ఇల్లల్లాహ్,

అష్హదు అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్

అష్హదు అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్

హయ్యా అలస్సలాహ్, హయ్యా అలస్సలాహ్

హయ్యా అలల్ ఫలాహ్, హయ్యా అలల్ ఫలాహ్

ఖద్ ఖామతి స్సలాహ్, ఖద్ ఖామతి స్సలాహ్

(నమాజ్ కోసం నిలబడ్డాం, నమాజ్ కోసం నిలబడ్డాం)

అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్

లా ఇలాహ ఇల్లల్లాహ్

పిల్లవాడి చెవుల్లో అజాన్, ఇఖామత్ వాక్యాల్ని వినిపించడంలోని మతలబు ఏమంటే తల్లిదండ్రులిద్దరూ పిల్లవాడు పుట్టగానే ముందుగా పిల్లవాడి చెవుల్లో అల్లాహ్ పేరును ఎలా వినిపించారో అలాగే ఇక ముందు

కూడా వారు తమ పిల్లవాడ్ని ముస్లింగా, నమాజీగా చెయ్యాలి; అతడికి ధార్మిక విద్య గరపాలి అన్నదే.

పిల్లవాడికి మొట్టమొదటి ఆహారంగా ఎవరైనా పుణ్యాత్ముడు, ధార్మికుడయిన వ్యక్తి చేత కొంచెం ఎండు ఖర్జూరం నమిలించి పిల్లవాడి నోట్లో పెట్టడం కూడా సంప్రదాయమే.

పిల్లవాని పేరు పెట్టడం (నామకరణం)

పిల్లవాడు పుట్టిన ఏడవ రోజున అతనికి పేరు పెట్టడం మంచిది. పేరు పెట్టడంలో షిర్క్(బహుదైవారాధనా)భావానికి ఏ మాత్రం తావీయరాదు. అల్లాహ్ పేరుతో కూడిన పేర్లు పెట్టడం దైవప్రవక్త (సల్లం)కు యిష్టం. ఉదా: అబ్దుర్రహ్మాన్, అబ్దుల్లాహ్ వగైరా.

అల్లాహ్‌కు 99 వాచకపేర్లు వున్నాయి. వాటిలో నుంచి ఏదయినా పేరు పెట్టదలిస్తే ఆ పేరుకు ముందు అబ్ద్ అనే పదం చేర్చాలి. ఉదాహరణకు అబ్దుస్సత్తార్, అబ్దుర్రహీం, అబ్దుల్ కరీం వగైరా. ఏదైనా సరే, ఇస్లామియ స్వభావం కల పేరు ఉండాలి. పీర్‌బక్ష్, హుసైన్ బక్ష్, సాలార్ బక్ష్, మస్తాన్, పెంటు సాబ్, బుడే సాబ్ వంటి పేర్లు పెట్టకూడదు.

పీర్‌బక్ష్, హుసైన్‌బక్ష్, సాలార్ బక్ష్, అబ్దున్నబి, అబ్దుర్రసూల్ లాంటి పేర్లు అసలే పెట్టగూడదు.

అఖీఖా

పుట్టిన ఏడోరోజున్నే అఖీఖా చేయడం మంచిది. అఖీఖా చేయడం సున్నత్. అయితే ఎవరైనా తమ పిల్లవాని కోసం అఖీఖా చేయలేకపోతే అందులో తప్పులేదు. అయితే అఖీఖా చేయడంలో ఎన్నో శుభాలు ఉన్నాయి.

అఖీఖా పద్ధతి: మగపిల్లవాడయితే రెండు మేకలుగాని, రెండు గొర్రెలుగాని ఖుర్బానీ ఇవ్వాలి. అంటే జిబహ్ చేయాలి. ఆడపిల్ల అయితే ఒక మేక లేదా

ఒక గొర్రెను జిబహ్ చేయాలి. అయితే మగపిల్లవానికి రెండు మేకలు లేదా రెండు గొర్రెలు జిబహ్ చేయడం తప్పనిసరికాదు, ఒకటి చేసినా సరిపోతుంది. అదే విధంగా మగపిల్లవాడయినా, ఆడపిల్ల అయినా అఖీఖా కోసం ఆవు, గేదె, ఒంటె లాంటి పెద్ద పశువుల్ని జిబహ్ చేస్తుంటే, దానిలో ఒకటి లేదా రెండు భాగాల్ని అఖీఖా కోసం ఇతరుల వాటాతో కలిపి మొత్తం ఏడు వాటాలలో రెండు వాటాల్ని తీసుకుని ఆ మేరకు డబ్బు చెల్లించవచ్చు. పనికిరాని జంతువును అఖీఖా కోసం ఉపయోగించరాదు. ఇది గుర్తుంచుకో వలసిన విషయం. మగపిల్లవాడికి, ఆడపిల్లకు అఖీఖా కోసం ఉపయోగించే పశువు పెంటి, పోతూ ఏదైనా కావచ్చు. అఖీఖా కోనం జంతువును జిబహ్ చేసేటప్పుడు ఈ క్రింది దుఆలను చదవటం మంచిది.

ఇన్నీ వజ్జహ్తు వజ్హియ లిల్లజీ ఫతరస్సమావాతి వల్ అర్జ హనీఫన్ వ్వమా అనా మినల్ ముష్రికీన్. ఇన్న సలాతీ వ నుసుకీ వ మహ్యాయ వ మమాతీ లిల్లాహి రబ్బిల్ ఆలమీన్, లాషరీక లహూ వ బిజాలిక ఉమిర్తు వ అనా మినల్ ముస్లి మీన్, అల్లాహుమ్మ హాజిహీ అఖీఖతు ఇబ్నీ...........

- దమ్ఉహా బిదమ్ఇహీ, వలహ్ముహా బిలహ్మిహీ
- వ జిల్దుహా బిజిల్దిహీ, వ ష'అరుహా బిష'అరిహీ
- వ ఇజ్ముహా బిఇజ్మిహీ, వ షహ్ముహా బిషహ్మిహీ
- అల్లాహుమ్మజ్ అల్హా ఫిదాఅమ్ మిన్హు మినన్నార్
- అల్లాహుమ్మ తఖబ్బల్హా, మిన్హు కమా తఖబ్బల్త
- మిన్నబియ్యిక ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం
- బిస్మిల్లాహి అల్లాహు అక్బర్.

నేను నా ముఖాన్ని భూమ్యాకాశాల ప్రభువు వైపు తిప్పుకున్నాను. నేను షిర్క్ చేసేవారిలోని వాణ్ణికాను. నా నమాజ్, నా ఆరాధనా విధానాలు, నా

జీవన్మరణాలు సమస్తం సకల లోకాల ప్రభువయిన అల్లాహ్ కోసమే అంకితం. ఆయనకు సాటి ఎవరూ లేరు. నాకు లభించిన ఆదేశం ఇదే. నేను ముస్లింల (విధేయుల)లోని వాడిని. ప్రభూ! ఈ పశువును, దీని రక్తమాంసాలను, దీని చర్మాన్ని, వెంట్రుకలను, దీని కొవ్వును-ఎముకలను నా పిల్లవాడి రక్త మాంసాలకు, చర్మం, వెంట్రుకలకు, కొవ్వు, ఎముకలకు బదులుగా అర్పిస్తు న్నాను. ప్రభూ! ఈ పశువుని నా పిల్లవాడి కోసం నరకాగ్ని నుండి కాపాడేదిగా చెయ్యి. ఓ అల్లాహ్! నీవు నీ ప్రవక్త ముహమ్మద్ (సల్లం) నుండి ఎలా స్వీక రించావో దీన్ని ఇతని తరపున స్వీకరించు. అందరికంటే గొప్పవాడైన అల్లాహ్ పేరుతో.

చుక్కలు పెట్టబడిన చోట పిల్లవాడి పేరు పలకాలి. ఆడపిల్ల అయినా ఇదే దుఆ చేయాలి. అయితే కాస్త తేడావుంది. అదేమంటే పైన వ్రాయబడిన దుఆలో "హు" వున్నచోట్ల "హా" అని చదవాలి. ఇబ్నీ (కుమారుడు) అన్నచోట బిన్తీ (కుమార్తె) అని చదవాలి. అంటే ఈ విధంగా:

"అల్లాహుమ్మ హాజిహీ అఖీఖతు బిన్తీ...... దమ్ఉహా బిదమ్ఇహా, వలహ్ముహా బిలహ్మిహీ వజిల్దుహా బిజిల్దిహా......."

అఖీఖా సందర్భంగా పశువును జిబహ్ చేయడంతో పాటు పిల్లవాడి తలవెంట్రుకలు కూడా తీయించాలి. జిబహ్ చేయడం, తల వెంట్రుకలు తీయడం వెంటవెంటనే ఒకేసారి చేయనవసరం లేదు. తలగొరిగాక పిల్లవాడి తలకు కుంకుమపువ్వు పులమడం మంచిది. పిల్లవాడి వెంట్రుకల్ని తూచి దాని బరువుకు సమానంగా బంగారం లేక వెండిని పేదలకు దానం చెయ్యాలి.

ఏ కారణం చేతనయినా ఏడవ రోజునే అఖీఖా చేయలేకపోతే, అదే లెక్క ప్రకారం మరే రోజయినా అఖీఖా చేయవచ్చు. ఉదాహరణకు పద్నాలుగో రోజు లేదా ఇరవై ఒకటోరోజు. లెక్క నిర్ణయించడానికి ఇది సులభమైన పద్ధతి. పిల్లవాడు ఏ రోజున పుట్టాడో ఆ రోజుకు ఒక దినం ముందురోజు అఖీఖా చేయాలి. ఉదాహరణకు పిల్లవాడు శనివారం పుడితే శుక్రవారంనాడు, శుక్రవారం పుడితే గురువారంనాడు చేయాలన్నమాట.

అఖీఖాలో జిబహ్ చేయబడిన పశువు మాంసం ఇంట్లోవారందరూ తినవచ్చు. పచ్చి మాంసాన్ని లేదా వండిన మాంసాన్ని బంధుమిత్రులకు పంచవచ్చు. లేదా విందుచేసి కూడా తినిపించవచ్చు.

ఖత్నా (సున్నతీ)

ఖత్నా (సున్నతీ) దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలై) సంప్రదాయం (సున్నత్). అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) షరీఅత్‌లోనూ దానికి అదేస్థాయి కల్పించబడింది.

చాలామంది ముస్లింలు పిల్లవాడు బాగా పెరిగిన తర్వాత ఖత్నా చేయిస్తుంటారు. షరీఅత్ తరఫున ఇటువంటి నిబంధన ఏదీ లేకపోయినా, ఖత్నా కోసం వయస్సు నిర్ణయించక పోయినా పుట్టిన తరువాత వీలయినంత త్వరగా ఖత్నా చేయించడం ఎంతో మంచిది. పిల్లవాడు పెద్దవాడైన తరువాత ఖత్నా చేయించడంలో పరదా ఇబ్బందులు ఎదురవుతాయి. అది మంచిది కాదు. ఖత్నా వలన ముస్లింకు, ముస్లిమేతరునికిగల బాహ్యాపరమైన గుర్తింపు కలుగుతుంది. అందుచేత ముస్లింలు దీనిని ముఖ్యమని భావిస్తారు.

ఖత్నా, అఖీఖాలలోని దురాచారాలు

ముస్లింలలో ధర్మరాహిత్యం, అజ్ఞానాల కారణంగా ఎన్నో దోషాలు పుట్టుకొచ్చాయి. ఇందులో ఖత్నా, అఖీఖా, నికాహ్ సందర్భాలలో రకరకాల ఆచారాల్ని పాటించడం కూడా చేరివుంది. పేదవారు అప్పులు చేసి మరీ ఈ దురాచారాల్లో వృథాఖర్చు చేసి డబ్బు తగలేస్తుంటారు. ఇదెంతో విచారకరమైన విషయం. ఈ దురాచారాల వివరాల్లోకి వెడితే పెద్ద జాబితా తయారవుతుంది. ముక్తసరిగా చేప్పాలంటే పైన తెలుపబడినవి తప్ప ఇతర విషయాలన్నీ అల్లాహ్‌కు ఆగ్రహం కలిగించే తప్పుడు ఆచారాలే.

పాలు త్రాగించడం

పిల్లవాడికి రెండేళ్ళు మాత్రమే తల్లి పాలు పట్టించాలి. అంతకు మించి ఎక్కువ కాలం పాలు పట్టించడం మంచిది కాదు. ఎవరైనా ఇతరుల పిల్లలకు

పాలు పట్టినా, ఒకటి, రెండు గుక్కలు త్రాగించినా ఆమెకు ఆ పిల్లవాడు స్వంత కొడుకు లాంటివాడు అయిపోతాడు. పిల్లవాడికి పాలు త్రాగించిన స్త్రీ కన్నతల్లి లాంటిదవుతుంది.

పిల్లవానికి ఇస్లామీ శిక్షణ

పిల్లవాడు పెరిగి మాట్లాడటం ఆరంభించినపుడు మొట్టమొదట అతనికి "లా యిలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్" (అల్లాహ్ తప్ప మరెవరూ ఆరాధనకు అర్హులు కారు. ముహమ్మద్ (సల్లం) దేవుని ప్రవక్త) అనే సద్వచనం (కలిమయె తయ్యిబా) పలకడం నేర్పాలి. పిల్లవాడు మాట్లాడడం ప్రారంభించినపుడు ఈ క్రింది ఆయత్ కూడా నేర్పడం మంచిది.

> **"వ ఖులిల్ హమ్దు లిల్లా హిల్లజీ లమ్ యత్తఖిజ వలదన్ వలమ్ యకుల్లహూ షరీకున్ ఫిల్ ముల్కి వలమ్ యకుల్లహూ వలియ్యుమ్ మినజ్జుల్లి వ కబ్బిర్హు తక్బీరా."**

అర్థం:- మీరు చెప్పేయండి! సకల స్తోత్రాలు దైవం కొరకే. ఆయన తనకు కుమారునిగా ఎవరినీ చేసుకోలేదు. ఆయన రాజ్యాధికారంలో ఆయనకు సాటి ఎవరూ లేరు. ఎలాంటి పరిస్థితిలోనూ ఆయనకు ఎవరి సహాయ సహకారాల అవసరం లేదు. ఆయన నిరపేక్షాపరుడు. మీరు ఆయన్ని స్తుతిస్తూ ఉండండి.

పిల్లవాడికి ఈ ఆయత్ కంఠస్తం కాకపోతే భావాన్ని కంఠస్తం చేయించి అతని మస్తిష్కంలో ఉండేటట్లు చేయండి.

పిల్లవాడికి ఏడేళ్ళు వచ్చాక అతడ్ని నమాజ్‌కు వెంట తీసుకు వెళ్ళండి. పదేళ్ళ వయస్సుకు చేరుకున్న తరువాత పదేపదే చెప్పినప్పటికీ నమాజ్ చేయకపోతే హెచ్చరించడానికి చిరుదెబ్బలు వేయవచ్చు. పదేళ్ళు నిండిన తరువాత అతని కోసం వేరుగా ప్రక్క (బెడ్) ఏర్పాటు చేయండి. ప్రాపంచిక విద్య కోసం తల్లిదండ్రులు ఎలాగూ ఏర్పాట్లు చేస్తూనే ఉంటారు. కాని తమ

పిల్లలకు ధార్మిక విషయాల కనీస పరిజ్ఞానం, హలాల్, హరాంలను తెలుసుకునేటంతగా ధార్మిక విద్య గరపడం తల్లిదండ్రుల బాధ్యత.

వివాహం

పిల్లవాడు పెద్దయిన తర్వాత తల్లిదండ్రులకు అతనికోసం ఇల్లు సమకూర్చాలన్న ఆలోచన కలుగుతుంది. తమ పిల్లవాడికి లేదా ఆడపిల్లకు సంబంధాలు వెతికేటప్పుడు సాధారణంగా సిరిసంపదల తళుకుబెళుకులపై పడిచస్తారు. వాస్తవానికి ప్రాపంచిక సంపద అస్థిరమైనది. దానిపై భరోసా వుంచలేం. కొందరు అందచందాలకు ప్రాధాన్యతనిస్తారు. అనేక మంది వంశంలోని నిమ్నోన్నత భావాలను దృష్టిలో వుంచుకుంటారు. ఒక ముస్లిం ఇతర ముస్లింల నుండి పెళ్ళిసంబంధాన్ని కోరుకున్నప్పుడు ధర్మపరాయణతను, బుద్ధికుశలతను మాత్రమే అన్వేషించాలి. వంశంలోని నిమ్నోన్నతలను దృష్టిలో పెట్టుకోవడం చాలా చెడ్డ విషయం. ఒకవేళ వధూ వరుల ఇంటి పద్ధతులు ఒకేపోలిక ఉంటే, వంశపరంగా చుట్టరికం ఉంటే, ముందు నుండి వారు ఒకరి నొకరు ఎరిగివున్న వారయితే ఇది చాలా మంచిది. ఇందువలన మనస్తత్వాలు కలవడానికి ఆస్కారం ఏర్పడుతుంది. కాని ఇది తప్పనిసరి అని భావించడం సరికాదు. చాలామంది తెగ, వంశం చాలా అవసరం అని భావిస్తారు. మరో తెగ అమ్మాయిని చేసుకోవడంగాని వారికి తమ పిల్లను ఇవ్వడంకాని చెయ్యరు. కొన్ని కుటుంబాలవారు తమను తాము చాలా ఉన్నతులుగా భావిస్తారు. ఇతరుల్ని హీనంగా చూస్తారు. ఇలాంటి ఆలోచనా తీరు ఇస్లామియ బోధనలకు వ్యతిరేకం. అల్లాహ్ మనల్ని ఇటువంటి ఆలోచనల నుండి కాపాడుగాక!

పిల్లల పెళ్ళిళ్ళు వీలైనంత త్వరగా చెయ్యాలని షరీఅత్ ఎంతగానో తాకీదు చేస్తోంది. దీనివల్ల వారి దృష్టి, హృదయాలు దారి తప్పవు. బాధ్యతాయుతంగా జీవితం గడపడం అలవాటవుతుంది.

చాలామంది పెళ్ళిలో తమ తాహతుకు మించి ఖర్చుచేస్తారు. దానివల్ల ప్రపంచంలో అవమానం, ఆందోళన తప్ప ఏమీ లభించదు. అల్లాహ్ కూడా

అగ్రహిస్తాడు. దివ్య ఖుర్ఆన్‌లో అవసరానికి మించి ఖర్చుచేసే వారు షైతాను సోదరులు అని చెప్పబడింది. షరీఅత్ బోధనలపట్ల శ్రద్ధ వహిస్తే ముస్లింలు ప్రపంచంలో అవమానం, ఆందోళనల నుండి రక్షణ పొందుతారు. పర లోకంలో దైవానుగ్రహాన్ని పొందగలుగుతారు.

మహర్

వివాహం విషయంలో షరీఅత్ ఖర్చునంతా పెళ్ళికుమారుడి పైనే వేసింది. అల్లాహ్ పురుషుడ్ని బలమయిన వాడిగా, అంటే బరువు బాధ్యతలన్నీ మోసేవాడుగా చేశాడు. ఇతరుల్ని చూసి ముస్లింలలో కూడా ఎన్నో సిగ్గుమాలిన ఆచారాలు కొనసాగడం సిగ్గుచేటు, ఎంతో విచారకరమై విషయం. మన దేశంలోని కొన్ని ప్రాంతాలలోనయితే అబ్బాయిల్ని కొనడం-అమ్మడం కూడా జరుగుతోంది. అబ్బాయి తరపువారు అమ్మాయి తరపువారి నుండి రకరకాల డిమాండ్లు చేస్తున్నారు. అమ్మాయి తల్లిదండ్రులు ఆ డిమాండ్లను తీర్చలేక పోతున్నారు. ఈకారణంగా ఎందరో కన్యలు పెళ్ళిళ్ళకు నోచుకోవడం లేదు. ఇలా కట్న కానుకల డిమాండ్లు చేయడం ఇస్లాం బోధనలకు విరుద్ధమేకాక పురుషుని వ్యక్తిత్వం, హోదాలకు కూడా వ్యతిరేకం. తన భార్య అవసరాల్ని స్వయంగా తీర్చడంలోనే పురుషుని గొప్పతనం ఉంది తప్ప, అతడే స్వయంగా భార్య ముందు, ఆమె తల్లిదండ్రుల ముందు చేయి చాపడంలో కాదు. ఇది స్త్రీకి్కూడా ఎంతో అవమానకరం.

వివాహం సందర్భంగా ఇస్లాం పురుషునిపై మహర్ భారం వేసింది. మహర్ ఒక నిర్ణీత మొత్తానికి పేరు. పురుషుని తరపున వివాహ సందర్భంగా స్త్రీ కోసం దీనికి అంగీకారం తీసుకోవడం జరుగుతుంది. ఇది రెండు రకాలు:

1. ముఅజ్జల్ మహర్ 2. గైర్ ముఅజ్జల్ మహర్

మహర్ ముఅజ్జల్ అంటే అంగీకరించబడిన మొత్తాన్ని నగదుగా స్త్రీ ఎప్పుడు కావాలంటే అప్పుడు కోరుకోగలదు. మహర్‌గైర్ ముఅజ్జల్ అంటే ఇది అప్పు అన్నమాట. అంటే విధివశాత్తు విడాకులకు దారితీసినా, లేక భర్త

మరణించినా దాన్ని అతడి వారసులు భార్యకు చెల్లించాల్సి ఉంటుంది. అయితే మహరె గైర్ ముఅజ్జల్‌ను భర్త ఎప్పుడయినా, సమయానికి ముందు కూడా చెల్లించవచ్చు.

మన దేశంలో చాలామటుకు మహర్ మొత్తాన్ని చెరి సగం చేసు కుంటారు. అంటే సగం మొత్తం మఅజ్జల్‌గా సగం గైర్ ముఅజ్జల్‌గా ఏర్పాటు చేసుకుంటారు. ఇందులో కూడా ఎటువంటి అభ్యంతరం లేదు. అయితే చాలామంది మహరె ముఅజ్జల్ ధనాన్ని చెల్లించడం అంతగా అవసరం లేదని భావిస్తారు. "ఆ,...., ఈ రోజుల్లో ఎవరిస్తున్నారు గనక మనం ఇవ్వడానికి?" అంటారు. ఇది తప్పు. షరీఅత్‌కు వ్యతిరేకం. భార్యతన మహర్‌ను మాఫీ చేస్తే లేదా అడగకపోతే అది వేరే విషయం. మహరు ధనాన్ని అడిగినప్పటికీ చెల్లించ కుండా భార్యతో సంపర్కం ధర్మసమ్మతం కాదు.

మహర్ మాత్రమేగాక భార్య అవసరాలకు అయ్యే ఖర్చు భరించడం, ఆమె బస కోసం ఇల్లు ఏర్పాటు చేయడం కూడా భర్త బాధ్యతే.

జహేజ్ (పెళ్ళి కానుకలు)

ముస్లింలలో ఒక చెడ్డ అలవాటుగా మారిపోయిన విషయం మరొక టుంది. అబ్బాయి తరపువారు అమ్మాయి తరపు వారిని భారీ వస్తు సామగ్రిని కట్నకానుకలుగా అడుగుతున్నారు. అమ్మాయి తరపువారు కూడా డాబుసరికి పోయి భారీఎత్తు కానుకలు ఇస్తున్నారు. వాటి కోసం జీవితాంతం సంపాదించిన దంతా ధారపోస్తున్నారు. కానుకలుఇలా ఇచ్చే దురలవాటు ఎన్నో కుటుంబాల్ని వీధిపాలు చేస్తోంది. అల్లాహ్ ముస్లింలకు సద్బుద్ధి, సదావగాహనలు కలిగించు గాక! అబ్బాయి తరపువారు కానుకలు డిమాండ్ చేయడం ఎంత సిగ్గుచేటు? లోకుల మెప్పు కోసం భారీగా కానుకలు ఇవ్వడం ఎంతటి మూర్ఖత్వం?

నికాహ్

నికాహ్ షరతు పూర్తి చెయ్యడానికి ఇద్దరు సాక్షుల సమక్షంలో రెండు మాటలు చాలు. ఒకటి, పురుషుడు "నేను ఫలానా అమ్మాయిని నికాహ్

చేసుకున్నాను" అని, స్త్రీ "నేను దీన్ని అంగీకరిస్తున్నాను" అని చెప్పాలి. లేదా స్త్రీ "నేను ఫలానా పురుషుడ్ని నికాహ్ చేసుకున్నాను" అని, పురుషుడు "నేను దీన్ని అంగీకరిస్తున్నాను" అని చెప్పాలి. నమ్మకస్తులయిన ఇద్దరు సాక్షులు ఈ మాటలు వింటే నికాహ్ అయినట్లే. మొదటి మాటను ఈజాబ్ అనీ, రెండో మాటను ఖుబూల్ అనీ అంటారు.

నేడు అమల్లో వున్న నికాహ్‌పద్ధతి షరీయత్‌పరంగా ఆమోదయోగ్య మైనదే. దాని ప్రకారం ఒక పెద్ద జనసమూహంలో అమ్మాయి తరఫున ఒక ప్రతినిధి వుంటాడు, అతడ్ని వకీల్ అంటారు. ఈ వకీలే నికాహ్ కోసం అమ్మాయి (వధువు) నుండి అనుమతి తీసుకుంటాడు. ఈ అనుమతి మాటలు విని సాక్ష్యమివ్వడానికి అతను ఇద్దరు సాక్షుల్ని తనవెంట తీసుకువెళతాడు.

ఆ తర్వాత ఆ ప్రతినిధి ఖాజీ (నికాహ్ చేయించే వ్యక్తి) ఎదుట "అమ్మాయి ఫలానా పురుషుడ్ని ఇంత మహర్‌తో వివాహం చేసుకోవడానికి అనుమతి ఇచ్చింది" అంటాడు. సాక్షులు అతడి మాటను ధృవీకరిస్తారు. అప్పుడు ఖాజీ నికాహ్ ప్రసంగం చేస్తాడు. ఆ తర్వాత వరుని ఎదుట వధువు పేరు, మహర్ వగైరా వివరాలు పేర్కొని నికాహ్ కోసం అతని అంగీకారం తీసుకుంటాడు. వరుడు తన అంగీకారం తెలుపుతాడు నికాహ్ అయిపోతుంది. సాక్షుల పేర్లు, వకీల్ పేరు, వధూవరుల వివరాలు, సంబంధిత వ్యక్తుల సంతకాలతో ఒక జ్ఞాపికా పత్రం (నికాహ్ నామా)తయారవుతుంది. షరీఅత్ పరంగా ఇలాంటి దస్తావేజు తయారు చేసుకోవడం అవసరం లేదు. కాని ముఖ్యమైన సందర్భం ఏదైనా వచ్చినప్పుడు ఇటువంటి దస్తావేజు అవసరం అవుతుంది. కాబట్టి ఇలా చేయడంలో తప్పు లేదు. నికాహ్‌లో సాక్షులుగా నియమించబడినవారు ప్రాజ్ఞులుకాని కుర్రాళ్ళు కాకూడదు. ప్రాజ్ఞులైన ముస్లింలు అయివుండాలి. సాక్షులుగా కనీసం ఇద్దరు పురుషులు లేదా ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలు అయినా ఉండాలి.

నికాహ్ ప్రసంగం

నికాహ్ సందర్భంగా ఖాజీ చేసే ప్రసంగం ఇలా ఉంటుంది:

అల్‌హమ్దు లిల్లాహి నహ్‌మదుహూ వ నస్తయీనుహూ వ నస్తగ్ ఫిరుహూ వనూమిను బిహీ వనతవక్కలు అలైహి వనవూజు బిల్లాహి మిన్ షురూరి అన్‌ఫుసినా వ మిన్ సయ్యిఆతి ఆమా లినా మయ్యహ్‌ది హిల్లాహు ఫలా ముజిల్లలహూ వ మన్ యుజ్‌లిల్‌హు ఫలా హాది యలహూ, వ నష్‌హదు అన్‌ల్లా యిలాహ ఇల్లల్లాహు వహ్‌దహు లాషరీకలహూ, వనష్‌హదు అన్న సయ్యిదినా వ మౌలానా ముహమ్మదన్ అబ్దుహు వ రసూలుహూ సల్లల్లాహు అలైహి వఅలా ఆలిహీ వ అస్‌హాబిహీ వ అజ్‌వాజిహీ వ జుర్రియాతిహీ వ సల్లమ తస్లీమన్ కసీరన్ కసీరా. అమ్మా బాద్, ఫ అవూజు బిల్లాహి మినష్షయ్‌తా నిర్రజీమ్, బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్, యా అయ్యుహల్లజీన ఆమనుత్త ఖుల్లాహ వఖూలూ ఖౌలన్ సదీదన్ యుస్లిహ్ లకుమ్ ఆమాలకుమ్ వ యగ్‌ఫిర్‌లకుమ్ జునూబకుమ్ వ మన్‌యుతి ఇల్లాహ వ రసూలహూ ఫఖద్ ఫాజ ఫౌజన్ అజీమా. వ ఖాలల్లాహు తఆలా యా అయ్యుహన్నాసుత్తఖూ రబ్బకుముల్లజీ ఖలఖకుమ్ మ్మిన్‌నఫ్సిన్ వాహిదతిన్ వ ఖలఖ మిన్‌హా జౌజహా వ బస్స మిన్‌హుమా రిజాలన్ కసీరన్ వ్వ నిసాఅ. వత్తఖుల్లా హల్లజీ తసాఅలూన బిహీ వల్ అర్‌హామ ఇన్నల్లాహ కాన అలైకుమ్ రఖీబా, వ ఖాలల్లాహు తఆలా వహువల్లజీ ఖలఖ మినల్ మాఇ బషరన్ ఫజఅలహు నస్‌బన్ వసహ్‌రన్ వకాన రబ్బుక ఖదీరా. వఖాలన్నబియ్యు సల్లల్లాహు అలైహి వ ఆలిహీ వసల్లమ్. అన్నికాహు మిన్ సున్నతీ ఫమన్ రగిబ అన్ సున్నతీ ఫలైస మిన్నీ. వ ఖాలన్నబియ్యు సల్లల్లాహు అలైహి వఆలిహీ వసల్లమ్ తజవ్వజుల్ వదూదుల్ వదూద ఫఇన్నీ ముకా సిరుబికుముల్ ఉమమ్.

ఈ నికాహ్ ప్రసంగానికి తెలుగు అనువాదం

సకల స్తోత్రాలు అల్లాహ్ కొరకే. మేము ఆయన్నే స్తుతిస్తున్నాము. ఆయన్నే సహాయం చేయమని వేడుకుంటున్నాము. ఆయననే మా పాపాలకు క్షమాభిక్ష కోరుతున్నాం. ఆయన్నే విశ్వసిస్తున్నాం. ఆయన్నే నమ్ముతున్నాం. మనస్సు కోరే చెడుల నుండి, చెడ్డ పనుల నుండి ఆయన శరణు కోరుతున్నాం. ఆయన సన్మార్గం చూపిన వాడిని ఎవరూ దారి తప్పించలేరు- ఆయన దారి తప్పించిన వాడికి ఎవరూ సన్మార్గం చూపలేరు. అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు ఎవరూ లేరని మేము సాక్ష్యమిస్తున్నాము. ఆయన ఒక్కడే. ఆయనకు సాటి ఎవరూ లేరు. మా నాయకుడయిన ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయన దాసుడు, ప్రవక్త అని మేము సాక్ష్యమిస్తున్నాము. అల్లాహ్ ఆయనపై, ఆయన వంశస్థులపై, ఆయన అనుచరులపై, ఆయన భార్య లపై, ఆయన సంతానంపై అపార కారుణ్యం వర్షింపచేయుగాక! నేను శాప గ్రస్తుడయిన షైతాన్ బారి నుండి తప్పించబడి ఆయన శరణులోకి వస్తున్నాను. అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ఆరంభిస్తున్నాను. విశ్వాసులారా! అల్లాహ్‌కు భయపడండి. సత్యాన్నే పలకండి. ఆయన మీ కర్మల్ని సంస్కరిస్తాడు. మీ పాపాలను క్షమిస్తాడు. అల్లాహ్, ఆయన ప్రవక్తకు శిరసావహించినవాడు గొప్ప సాఫల్యం పొంద గలడు. ప్రజలారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించాడు. దాని నుండే దాని జతను పుట్టించాడు. ఆ జంట ద్వారా అనేక మంది స్త్రీ పురుషులను అవనిలో వ్యాపింప చేశాడు. ఎవరి సాక్షిగా మీరు మీ హక్కును కోరుతున్నారో ఆ ప్రభువుకు భయపడండి. బంధువుల హక్కులను దృష్టిలో పెట్టుకోండి. అల్లాహ్ మీ అన్ని విషయాలనూ కనిపెట్టి ఉన్నాడు. ఆయనే ద్రవపదార్థంతో మనిషిని సృష్టించాడు. తిరిగి అతనికి అత్తింటి బంధువు లను ఇచ్చాడు. మీ ప్రభువు ప్రతి దానిపై అధికారం కలిగి ఉన్నాడు.

దైవప్రవక్త (సల్లం) సెలవిచ్చారు: "నికాహ్ నా సంప్రదాయం. నా సంప్ర దాయాన్ని వ్యతిరేకించేవాడు నావాడు కాదు." దైవప్రవక్త (సల్లం) సెలవిచ్చారు:

"అమితంగా ప్రేమించేవారు, అధిక సంతానం కనేవారయిన స్త్రీలను వివాహ మాడండి. ఇతర జాతుల కన్నా మీ సంతానం అధికం కావడం చూసి నేను గర్విస్తాను."

ఈ ప్రసంగం తర్వాత ఖాజీ వరునివైపు తిరిగి సాక్ష్య వచనం (కలిమ యె షహాదత్)తో పాటు బిస్మిల్లాహ్ పదాలను పలికిస్తాడు. ఇలా చేయడం షరీఅత్ పరంగా తప్పనిసరి కాదు గాని, ఇలా చేయడంలో తప్పు కూడా లేదు. కలిమయె షహాదత్ తర్వాత ఖాజీ ఇలా ప్రశ్నిస్తాడు.

నేను ఫలానా వారి...... (వధువు తండ్రిపేరు) అమ్మాయి .... (వధువు పేరు)ని...........(నిర్ణీత) మహరుకు బదులుగా........ రూపాయిలు ముఅజ్జల్ గానూ.......... రూపాయిలు లేదా మవజ్జల్తో నీ నికాహ్లో యిచ్చాను. నీవు అంగీకరిస్తున్నావా?

అందుకు జవాబుగా వరుడు "అవును, నేను అంగీకరిస్తున్నాను" అనాలి. ఇలా నికాహ్ కార్యక్రమం పూర్తి అవుతుంది.

వివాహానికి నిషిద్ధమైన స్త్రీలు

ఏయే స్త్రీలతో నికాహ్ నిషిద్ధం అవుతుందో దివ్యఖుర్ఆన్, నిసా సూరాలోని 23వ ఆయతులో ఇలా వివరించబడింది:

"మీ తల్లులు, కుమార్తెలు, సోదరీమణులు, మేనత్తలు, పిన్నులు, సోదరుల కుమార్తెలు, సోదరీమణుల కుమార్తెలు, మీకు పాలు త్రాపించిన తల్లులు, మీతో పాటు (ఒకేతల్లి)పాలు త్రాగిన సోదరీమణులు, మీ అత్తలు, మీతో శారీరక సంబంధం కల వారితో వచ్చిన, వారి కుమార్తెలు, మీ కన్న కుమారుల భార్యలు, మీ భార్యల సోదరీమణులు, వీరిలో ఎవరితోనూ మీ వివాహం ధర్మసమ్మతం కాదు."

నికాహ్ విషయంలో క్షీర (ఒకే తల్లిపాలు త్రాగిన వేర్వేరు స్త్రీ, పురుషుల) సంబంధం రక్త సంబంధం లాంటిదే. ఏ స్త్రీ పాలు త్రాగించినా ఆమె కన్నతల్లితో సమానమే. ఆమె బంధువులందరూ కన్నతల్లి బంధువులమాదిరే.

తలాఖ్ (విడాకులు)

ఒక్కోసారి భార్యాభర్తల మధ్య పొరపొచ్చాలు వస్తుంటాయి. ఇద్దరి స్వభావాలు వేర్వేరుగా ఉంటాయి. నిభాయించడానికి చేసిన ప్రయత్నాలు బెడిసి కొడతాయి. జీవితం నరకప్రాయం అవుతుంది. రకరకాల తగవులు వచ్చి పడతాయి. అందుచేత షరీఅత్ పురుషునికి విడాకులిచ్చే హక్కునిచ్చింది. అంటే అతడు వివాహబంధాన్ని తెంచుకోగలడు.

తలాఖ్ మూడు రకాలు.

1. తాలఖె రజయీ.

2. తలాఖె బాయినహ్.

3. తలాఖె ముగల్లిజహ్.

1. "నేను నీకు విడాకులిచ్చాను" లేక "నీకు స్వేచ్ఛ కల్పిస్తున్నాను" లేక "నీతో సంబంధం తెంచుకుంటున్నాను" వంటి స్పష్టమైన పదాలతో విడాకు లిస్తే, ఇలాంటి పదాలు ఒకటి లేక రెండుసార్లు పలికితే ఇది "తలాఖె రజయీ" అవుతుంది. అంటే భర్త కోరితే గడువు (ఇద్దత్)లోపు భార్యను నికాహ్ లేకుండానే తిరిగి వివాహబంధంలోకి తీసుకోవచ్చు. మళ్లీ నికాహ్ చేసుకో వలసిన పనిలేదు.

2. స్పష్టమైన మాటలకు బదులు అస్పష్టమైన మాటలతో పలికితే దాని అర్థం తలాఖ్ అవనూవచ్చు. లేదా మరో అర్థం తీయనూ వచ్చు. ఈ మాటలు పలికేటప్పుడు తలాఖ్ ఇచ్చే ఉద్దేశం గనక లేకపోయి నట్లయితే, తలాఖ్ కాజాలదు. తలాఖ్ ఇచ్చే ఉద్దేశం ఉంటే అది తలాఖె బాయిన అవుతుంది. అంటే ఇప్పుడు భార్యతో మరోసారి నికాహ్ చేసుకోవాల్సి ఉంటుంది.

3. స్పష్టమైన పదజాలంతో, నేను నీకు విడాకులిస్తున్నాను, నేను నీకు తలాఖ్ ఇస్తున్నాను అని మూడుసార్లు పలికితే లేదా ఒకేసారి నేను నీకు

మూడు సార్లు తలాఖ్ ఇస్తున్నాను అని చెబితే అది తలాఖె ముగల్లిజా అవుతుంది. అంటే అతడు ఇక తన భార్యను తిరిగి నికాహ్ చేసుకోలేడు. భార్య అతనికి పరాయి స్త్రీ అయిపోతుంది. ఒకవేళ ఎవరయినా మరో పురుషుడు ఇద్దత్ ముగిసిన తర్వాత ఆ స్త్రీని వివాహం చేసుకుని తిరిగి ఏ కారణం చేతనయినా అతడు కూడ విడాకులిస్తే లేక మరణించినట్లయితే తిరిగి ఆ తలాఖ్ లేదా మర ణానికి సంబంధించిన ఇద్దత్ ముగిసిన తర్వాత అతడు తిరిగి ఆ స్త్రీని వివాహం చేసుకోవచ్చు. అయితే ఒక విషయం గుర్తుంచుకోవాలి. మరో పురుషునితో 'నీవాస్త్రీని వివాహం చేసుకుని తర్వాత వదిలేయి' అని ఒప్పందం చేసుకోవడం హరామ్ అవుతుంది. (ఉత్తుత్తి పెళ్ళి, ఉత్తుత్తి విడాకులు జరగకూడదు)

స్పష్టమయిన పదజాలంతో ఒకటి లేదా రెండుసార్లు విడాకులు ఇచ్చిన తర్వాత భర్త తన భార్యను తిరిగి నికాహ్ చేసుకోకుండానే తన ఇంట ఉండనీయ వచ్చు. కాని ఆ తర్వాత ఆమెకు విడాకులిస్తే (మూడోసారి అవుతుంది గనుక) అది తలాఖె ముగల్లజ అయిపోతుంది. భర్త ఆ స్త్రీని నికాహ్ చేసుకోవడం ధర్మసమ్మతం కాజాలదు.

ఈ సమస్యలన్నీ ఇమామ్ అబూ హనీఫా (రహ్మలై)గారి ఫికహ్ (ధర్మావ గాహన) నుండి గ్రహించబడ్డాయి. ఇతర ఇమాముల దృష్టిలో ఈ సమస్యల విషయంలో భేదం ఉంది. దీనికి సంబంధించిన వివరాలన్నీ ఉలమాల నుండి పొందవచ్చు.

విడాకులిచ్చే సరైన విధానం

షరీఅత్‌లో విడాకులివ్వడం అనేది బహు చెడ్డ పనిగా చెప్పబడింది. విధిలేని పరిస్థితుల్లో విడాకులు ఇవ్వడం తప్పనిసరి అయినప్పుడు అందుకు సరైన పద్ధతి- ఒకసారి ఒక్క తలాఖ్ మాత్రమే ఇవ్వాలి. అదికూడా భార్య (శారీరకంగా) పరిశుద్ధ స్థితిలో ఉన్నప్పుడు మాత్రమే ఇవ్వాలి. ఒకేసారి మూడు తలాఖ్‌లు ఇవ్వడం గొప్ప మూర్ఖత్వం. అల్లాహ్‌కు అది ఎంతో అయిష్టకరం.

ఇద్దత్ కాలం

విడాకుల తర్వాత లేక భర్త మరణానంతరం వెంటనే స్త్రీ తన భర్త ఇంటి నుండి బయటకు పోకూడదు లేదా మరోచోట వివాహం చేసుకోనూ జాలదు. భర్త ఇంటిలోనే కొన్నాళ్ళు వేచి ఉండాలి. ఈ వ్యవధిలో ఆమె రాత్రి గానీ, పగలుగానీ ఏవేళయినా ఇంటినుండి బయటకు వెళ్ళరాదు. మరోచోట వివాహం చేసుకోనూ కూడదు. ఈ వ్యవధినే షరీఅత్‌లో ఇద్దత్ అంటారు.

తలాఖె రజయీ అయినా, లేక తలాఖె బాయిన అయినా లేక తలాఖె ముగల్లిజా అయినా ఎట్టి పరిస్థితిలోనూ ఇద్దత్ గడిపి తీరాల్సిందే. తలాఖె రజయీలో విడాకులిచ్చేవాడు వివాహబంధం పునరుద్ధరించుకోదలిస్తే (అంటే రజ్అత) లేక తలాఖె బాయిన తర్వాత పునర్వివాహం చేసుకుంటే ఆ పునరుద్ధరణ లేదా పునర్వివాహం తర్వాత ఇద్దత్ పూర్తి అయినట్టే. మరో పురుషునితో వివాహం చేసుకోవడానికి స్త్రీ ఇద్దత్ గడువు పూర్తి చేయడం అవసరం. వివిధ స్త్రీల ఇద్దత్ వేర్వేరుగా వుంటుంది.

యవ్వనంలో ఉన్న స్త్రీ (అంటే బహిష్టు అవుతుండే స్త్రీ)కి ఇద్దత్, మూడుసార్లు బహిష్టు కావాలి. ఆతర్వాత ఆమెకు స్వేచ్ఛ లభిస్తుంది. అప్పుడు ఆమె తాను కోరిన చోటికి వెళ్ళవచ్చు; కోరిన వారిని వివాహమాడవచ్చు.

రజస్వలకాని బాలికగాని, వయస్సు ఉడిగిపోయిన వృద్ధ స్త్రీకిగాని విడాకు లివ్వబడితే, ఇద్దత్ మూడు నెలల్లో పూర్తి అవుతుంది. విడాకులు చాంద్రమానం ఒకటో తేదీన ఇవ్వబడితే అప్పుడు చాంద్రమానం ప్రకారం మూడు నెలలు లెక్కించాలి. లేదా 90 రోజులు లెక్కించాలి.

గర్భిణీ స్త్రీకి విడాకులివ్వబడితే ఆమెకు ఇద్దత్ ఆమె పురుడు పోసుకున్న తర్వాత పూర్తి అవుతుంది. విడాకులిచ్చిన వెంటనే కాన్పు జరిగినా, లేక నెలలు గడిచిన తరువాత కాన్పు జరిగినా సరే. వివాహం మాత్రమే జరిగి కాపురానికి వెళ్ళడం, భర్తతో కలవడం అంటూ జరగనప్పుడు ఎటువంటి ఇద్దత్ గడప నక్కరలేదు.

భార్య చిన్నపిల్ల అయినా, యవ్వనంలో వున్నా, వృద్ధురాలు అయినా భర్త మరణానంతరం నాలుగు నెలల పదిరోజులు ఇద్దత్ గడపాలి. మరణం చాంద్రమానం ఒకటోతేదీన సంభవిస్తే చాంద్రమానం ప్రకారం నాలుగు నెలల పదిరోజులు పూర్తి చేయాలి. లేకుంటే నాలుగు నెలలకు 120 రోజులు లెక్కకట్టి 130 రోజులలో ఈ ఇద్దత్ పూర్తి చేయాలి.

భర్త మరణించిన రోజే భార్యకు కాన్పు అయితే ఇద్దత్ కాన్పుతో ముగుస్తుంది. మరిన్ని వివరాలు విద్వాంసులనడిగి తెలుసుకోవచ్చు.

మరణం

పుట్టిన ప్రతి మనిషీ ఒకనాడు మరణించక తప్పదు. మరణం ఎక్కడ, ఎప్పుడు సంభవిస్తుందో ఎవరికీ తెలియదు. కనుక ప్రతి మనిషి ఎల్లప్పుడూ చావుకు సిద్ధపడి వుండాలి. ఎవరన్నా మరణించినట్లు కబురు అందినప్పుడు "ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్" (మనం అల్లాహ్ వద్ద నుండే వచ్చాం. అల్లాహ్ వద్దకే తిరిగి వెళతాం) అని పఠించాలని షరీఅత్ మనకు ఉపదేశిస్తోంది. చావు కబురు విని ఏడ్పులు, పెడబొబ్బలు పెట్టడాన్ని షరీఅత్ వారించింది.

మరణించిన తర్వాత మనిషి ఖననం చేయబడినప్పుడు బంధు మిత్రులంతా అతడ్ని ఒంటరిగా వదలి వెళ్ళిపోతారు. అతడి వెంట అతని కర్మలు మాత్రమే ఉండిపోతాయి. పూడ్చిన తర్వాత మున్కిర్, నకిర్ అనే ఇద్దరు దైవదూతలు వస్తారు. వారు మృతునికి ఇలా మూడు ప్రశ్నలు అడుగుతారు.

"నీ ప్రభువు ఎవరు?"

"నీ ధర్మం ఏది?"

"ముహమ్మద్ (సల్లం) గురించి నీకు తెలిసినది"

మృతుడు ఆ ప్రశ్నలకు సరైన సమాధానం చెబితే ప్రళయదినం వరకూ హాయిగా నిద్రిస్తాడు. లేకుంటే సమాధిలోనే యాతన ప్రారంభమవుతుంది. అల్లాహ్ మనలందర్నీ సమాధి యాతన నుండి కాపాడుగాక! (ఆమీన్)

మరణం సమీపించినప్పుడు మనిషి అల్లాహ్‌ను స్మరిస్తూ ఇలా దుఆ చేసుకోవాలి: "అల్లాహుమ్మగ్ ఫిర్లీ వర్హమ్‌నీ, వఅల్ హిఖ్‌నీ బిర్రఫీఖిల్ ఆలా. అల్లాహుమ్మ అయిన్నీ అలా గమరాతిల్ మౌతి వ సకరాతిల్ మౌత్."

అనువాదం: ఓ అల్లాహ్! నన్ను క్షమించు, కరుణించు. నన్ను పైనున్న మిత్రునితో కలుపు. దేవా! మరణ కాఠిన్య సమయంలో నన్నాదుకో.

మృత్యుముఖంలో ఉన్న మనిషి కలిమా పఠిస్తూ ప్రాణం వదలడానికి వీలుగా దగ్గర ఉన్నవారు అతనికి కలిమాను గుర్తుచేయాలి. కలిమాను బిగ్గరగా పఠించాలి. ముఖం కుడివైపుకు త్రిప్పి ఖిబ్లాకు అభిముఖంగా అతడ్ని వుంచాలి. యాసీన్ సూరా చదవడం ప్రారంభించాలి. ప్రాణం పోయిన తర్వాత శవం కనురెప్పలు మూయాలి. నోరు తెరచుకోకుండా గుడ్డతో దవడలు బిగించి కట్టాలి. రెండుకాళ్ళ బొటనవేళ్ళు కలిపి కట్టాలి. అప్పుడు "బిస్మిల్లాహి వ అలా మిల్లతి రసూలిల్లాహ్" (అల్లాహ్ పేరుతో, దైవప్రవక్త-సల్లం ధర్మంపై) అని కూడా చదవాలి. శవానికి స్నానం చేయించనంతవరకు శవం దగ్గర ఖుర్‌ఆన్ పఠించకూడదు.

శవానికి స్నానం చేయించడం

శవాన్ని స్నానం కోసం ఏదయినా బల్లమీద పరుండబెట్టాలి. మృత శరీరానికి నాభి నుండి చీలమండలం వరకూ వస్త్రంతో కప్పాలి. స్నానం చేయించే ముందు బల్లకు మూడు లేక ఐదు లేక ఏడుసార్లు సాంబ్రాణి పొగ పట్టాలి. ఒక పళ్ళెంలో నిప్పులుపోసి, ఆ నిప్పులమీద సాంబ్రాణి పొడి వేసి శవానికి నాలుగు వైపులా పొగ పెట్టాలి.

స్నానం కోసం వాడే నీటిలో రేగు ఆకులు వేసి వేడిచేయాలి. స్నానానికి ముందు (ఇస్తెంజా) శుభ్రం చేయించాలి. అందుకోసం చేతికి ఒక గుడ్డ చుట్టుకుని కాళ్ళమీద కప్పి ఉంచిన వస్త్రంలోనే మర్మాంగాలను శుభ్రం చేయాలి. శవం మర్మాంగాన్ని చూడటంగానీ, తాకడంగానీ చెయ్యకూడదు. ఆ

తర్వాత ఉజూ చేయించాలి. అయితే ఈ ఉజూ పుక్కిలింత, ముక్కులో నీరు పోయడం లేకుండా జరుగుతుంది. ఉజూలో మణికట్టుల నుండి తలవరకూ చేతులు కడగనవసరం లేదు. తర్వాత, ముఖం కడిగించాలి. మోచేతుల వరకు చేతులు కడిగించాలి. తర్వాత తలను తడిచేతులతో రుద్దాలి (మసహ్ చేయాలి). తర్వాత రెండు చేతులూ కడగాలి. ప్రాణం పోవడానికి ముందు మృతుడు గుసుల్ చేయవలసి ఉంటే అతడి నోటిలోనూ, ముక్కులోనూ నీరువేసి కడగడం తప్పనిసరి. అందుకోసం ఏదయినా పలుచని వస్త్రం లేక దూదిని నీటితో తడిపి దానిని నోటిలో, ముక్కు రంధ్రాల్లో తిప్పాలి. ఉజూ తర్వాత మురికిపోయేలా సబ్బులాంటి వస్తువుతో తలను బాగా కడగాలి. తర్వాత శవాన్ని ఎడమవైపుకు తిప్పి మూడుసార్లు తలనుండి కాళ్ళవరకూ వచ్చేలా నీళ్ళు పొయ్యాలి. ఆ తర్వాత శవాన్ని ఊతమిచ్చి కూర్చోబెట్టాలి. అతని పొట్టను చేత్తో మెల్లగా నొక్కాలి. ఒకవేళ కడుపులో నుండి ఏదయినా మలినం వెలువడితే దాన్ని తుడిచి కడగాలి. మలినం వెడలిన తర్వాత శవానికి తిరిగి ఉజూ లేదా గుసుల్ చేయించనవసరం లేదు. తర్వాత శవాన్ని ఎడమ వైపుకు తిప్పి కర్పూరం కలిపిన నీటిని తల నుండి పాదాల వరకు మూడుసార్లు పోయాలి. ఆ తరువాత శుభ్రమయిన తుండుతో శరీరం తుడవాలి.

కఫన్

శవానికి స్నానం చేయించాక కఫన్ వస్త్రాలు తొడిగించాలి. స్త్రీ శవానికి అయిదు వస్త్రాలుంటాయి: 1. చొక్కా, 2. క్రింది వస్త్రం (తహ్బంద్), 3. ఓణి, 4. ఛాతిని కప్పే వస్త్రం, 5. దుప్పటి. చొక్కా మెడ నుండి పాదాల వరకు ఉండాలి. దుప్పటి, (తహ్బంద్) వస్త్రాని కన్నా ఒక గజం పొడుగుండాలి. ఛాతీపై వస్త్రం ఛాతీ నుండి పొట్ట వరకు కప్పేలా వెడల్పుగా ఉండాలి. ఓణి మూడు మూరలు ఉండాలి. స్త్రీకి మూడు వస్త్రాలు, తహ్బంద్ (లుంగీ) వస్త్రం, ఓణి, దుప్పటి ఇవ్వబడినా పర్వాలేదు. కాని అంతకన్నా తక్కువ కఫన్ ఇవ్వడం మక్రూహ్, గత్యంతరం లేకపోతే అది వేరే విషయం.

పురుషుడ్ని మూడు వస్త్రాలతో కఫన్ తొడిగించాలి. చొక్కా, లుంగీ, దుప్పటి. పురుషుని కఫన్ కోసం రెండు వస్త్రాలు- లుంగీ, దుప్పటి వాడినా పర్వాలేదు. ఈరెండు వస్త్రాలు తల నుండి పాదాల వరకు పొడుగ్గా ఉంటాయి. శవానికి కఫన్ తొడిగించే ముందు సాంబ్రాణీతో మూడు లేక ఐదు సార్లు పొగ పట్టాలి.

కఫన్ తొడిగే పద్ధతి

కఫన్ తొడిగించే పద్ధతి ఈ విధంగా ఉంటుంది: స్త్రీ శవం అయితే ముందు పెద్ద దుప్పటి పరచాలి. దాని మీద లోవస్త్రం (లంగా), దానిపై చొక్కా సగం పరచి, మిగతా సగాన్ని మడిచి ఉంచాలి. శవాన్ని పరుండబెట్టి తలను వదలి చొక్కా వస్త్రంలోని మడచి ఉంచిన అర్థ భాగంతో శరీరం కప్పాలి. తల వెంట్రుకల్ని రెండు పాయలుగా చేసి చొక్కా పైన రొమ్ము మీద వేయాలి. ఆ తర్వాత ఓణీని తల నుండి శిరోజాలదాకా తెచ్చి కప్పాలి. తర్వాత లంగా వస్త్రం చుట్టాలి. మొదట ఎడమవైపు, తర్వాత కుడివైపు చుట్టాలి. తర్వాత రొమ్ము వస్త్రం కట్టాలి. ఆ తర్వాత దుప్పటిని ఎడమవైపు నుంచి తీసి కుడివైపు చుట్టాలి.

ఆ తర్వాత తల, పాదాల చివర్లలో గుడ్డపేలికలతో కట్టాలి. మరొక పేలికతో నడుంపై కూడా కట్టాలి. పురుషుని శవానికి కఫన్ తొడిగేటప్పుడు ముందుగా దుప్పటి పరవాలి. దానిమీద లుంగీ వస్త్రం పరచాలి. తర్వాత చొక్కా వస్త్రం లోని అర్థ భాగం పరచి, మిగతా అర్థ భాగాన్ని మడిచి ఉంచాలి. శవాన్ని పరుండబెట్టి తలను వదలి చొక్కా వస్త్రంలోని మడచి ఉంచిన అర్థ భాగంతో శరీరం కప్పాలి. తర్వాత లుంగీ వస్త్రాన్ని ఎడమ వైపు నుండి తీసి కుడి వైపుకు లాగి చుట్టాలి. ఆ తర్వాత పాదాల నుండి తల వరకు దుప్పటి చుట్టాలి.

జనాజా నమాజ్

గుసుల్, కఫన్ పనులు పూర్తి చేసిన తర్వాత మృతుని కోసం జనాజా నమాజ్ చేయాలి. జనాజా నమాజ్‌లో మృతుని మన్నింపుకోసం దైవాన్ని

ప్రార్థించడం, సిఫారసు చేయడం కూడా ఉంటాయి. జనాజా నమాజ్‌లో రుకూ, సజ్దాలు ఉండవు. ఖిబ్లాకు అభిముఖంగా నిలబడితే చాలు.

జనాజా నమాజ్ చేసే పద్ధతి

జనాజా నమాజ్‌లో కేవలం రెండు ఫరజ్‌లు ఉన్నాయి :

1. నాలుగుసార్లు అల్లాహు అక్బర్ పలకడం.

2. నిలబడి నమాజ్ చేయడం.

జనాజాను (శవాన్ని) ముందు భాగాన ఉంచి, ఇమామ్ దాని రొమ్ముకు ఎదురుగా నిలబడాలి. నమాజ్ కోసం ఇలా సంకల్పం చేసుకోవాలి.

"నేను నాలుగు తక్బీర్లతో జనాజా నమాజ్, మృతుని మన్నింపు కోసం దుఆ చేయడానికి సంకల్పించుకున్నాను. ఈ నియ్యత్ (సంకల్పం) చేసుకుని రెండు చేతులు చెవుల దాకా ఎత్తి అల్లాహు అక్బర్ అంటూ నమాజ్‌లో మాదిరి గావే చేతులు కట్టుకోవాలి

ఆ తరువాత "సుబ్‌హానకల్లాహుమ్మ వబిహమ్‌దిక వ తబారకస్ముక వతఆలా జద్దుక వజల్ల సనావుక వ లాయిలాహ గైరుక" (ఓ అల్లాహ్! నీవు పవిత్రుడవు. సకలస్తోత్రాలు నీకొరకే. నీపేరు శుభప్రదమైనది. నీ కీర్తి, ఘనతలు ఉన్నతమైనవి. నీవు తప్ప ఆరాధ్యుడు ఎవరూ లేరు) అని పఠించాలి.

ఇలా చదివిన తర్వాత మరొక సారి అల్లాహు అక్బర్ అనాలి. కాని చేతులు పైకెత్తకూడదు. ఆ తర్వాత దరూద్ షరీఫ్ పఠించాలి. నమాజ్‌లో చదివే దరూద్ చదవడమే ఉత్తమం.

"అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్ వఅలా ఆలి ముహమ్మదిన్ కమా సల్లయ్‌త అలా ఇబ్రాహీమ వఅలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్ మజీద్. అల్లాహుమ్మ బారిక్ అలా ముహమ్మదిన్ వఅలా ఆలి ముహమ్మదిన్ కమా బారక్‌త అలా ఇబ్రాహీమ వఅలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్ మజీద్."

అర్థం:- ఓ అల్లాహ్! నీవు ఇబ్రాహీంపై, ఆయన కుటుంబీకులపై ఎలా కారుణ్య వర్షం కురిపించావో, అలా ముహమ్మద్ (స)పై, ఆయన కుటుంబీకులపై కూడా కారుణ్య వర్షం కురిపించు. నిస్సందేహంగా నీవే ప్రశంసలకు అర్హుడవు, గౌరవనీయుడవు. ఓ అల్లాహ్! నీవు ఇబ్రాహీంపై, ఆయన కుటుంబీకులపై ఎలా శుభాన్ని కురిపించావో అలా ముహమ్మద్ (స)పై, ఆయన కుటుంబీ కులపై శుభాన్ని కురిపించు. నిస్సందేహంగా నీవు ప్రశంసలకు అర్హుడవు, గౌరవనీయుడవు.

ఆ తర్వాత మరొకసారి అల్లాహు అక్బర్ పలకాలి. చేతులు మాత్రం ఎత్తకూడదు. తర్వాత మృతుని కోసం దుఆ చేయాలి. పిన్నలకు, పెద్దలకు, స్త్రీలకు, పురుషులకు వేర్వేరు దుఆలు ఉన్నాయి.

మృతులు ప్రాజ్ఞులయిన వారయితే ఇలా దుఆ చేయాలి:-

"అల్లాహుమ్మగ్‌ఫిర్లి హయ్యినా, వ మయ్యితినా వ షాహిదినా వ గాయిబినా వ సఘీరినా వ కబీరినా వ జకరినా వ వున్సానా, అల్లాహుమ్మ మన్ అహ్‌యైతహూ మిన్నా ఫ అహ్‌యిహీ అలల్ ఇస్లామి వ మన్ తవఫ్ఫయ్‌తహూ మిన్నా ఫతవఫ్ఫహూ అలల్ ఈమాన్."

అర్థం: ఓ అల్లాహ్ మాలో బ్రతికున్నవారిని, మాలోని మృతుల్ని ఇక్కడ వున్న మా వారినీ, ఇక్కడ లేని మా వారినీ, మాలోని పెద్దల్నీ, మాలోని చిన్నల్నీ, మాలోని పురుషులనూ, మాలోని స్త్రీలనూ మన్నించు (మోక్షమివ్వు). ఓ అల్లాహ్! మాలోని వారిని సజీవంగా వుంచితే ఇస్లాంపై సజీవంగా ఉంచు. నీవు మరణం ప్రసాదించిన వారికి ఈమాన్‌పై మరణం ప్రసాదించు."

బాలుడయితే ఇలా దుఆ చేయాలి:

"అల్లాహుమ్మజ్‌అల్‌హు లనా ఫరతన్ వజ్‌అల్‌హు లనా అజ్రన్ వ జుఖ్రన్ వజ్‌అల్‌హు లనా షాఫిఅమ్ వముషఫ్ఫఅ".

అర్థం: ఓ అల్లాహ్! ఇతడ్ని మాకన్నా ముందు పంపి మాకోసం ఏర్పాట్లు చేసేవానిగా చెయ్యి. మాకోసం పుణ్యఫలం కారకునిగా చెయ్యి. మాకోసం నీవు ఎవరిని సిఫారసు కర్తగా అంగీకరిస్తావో ఇతడ్ని అలాంటి సిఫారసు కర్తగా చెయ్యి.

బాలికయితే ఈ దుఆ చేయాలి :

"అల్లాహుమ్మజ్అల్హా లనా ఫర్తన్ వఅజ్అల్హా లనా అజ్రన్ వజు్ఖ్రన్ వఅజ్అల్హా లనా షాఫిఅతన్ వ ముషప్ఫఅహ్."

ఈ దుఆ చేసిన తర్వాత తిరిగి అల్లాహు అక్బర్ అని పలకాలి. ఈసారి కూడా చేతులు పైకెత్తకుండా కుడి, ఎడమల వైపుకు ముఖం తిప్పుతూ "అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్"(నీపై శాంతి, దైవకారుణ్యం అవతరించుగాక) అని పలకాలి. దీంతో నమాజ్ ముగుస్తుంది. జనాజా నమాజ్ ఇమామ్, ముఖ్తదీలు అందరూ ఒకేవిధంగా చేస్తారు. తేడా ఒక్కటే. ఇమామ్ నాలుగు తక్బీర్లు బిగ్గరగా పలుకుతాడు. ముఖ్తదీలు మెల్లిగా పలుకుతారు.

జనాజా నమాజ్ చేసేవారు కనీసం మూడు పంక్తులుగా ఉంటే మంచిది. ఈ నమాజ్ మస్జిద్ బయట చేయాలి. జనాజాను మస్జిద్‌లోనికి తీసుకురాకూడదు. ఒకవేళ జనాజా మస్జిద్ బయట ఎదురుగా ఉండే ఏర్పాటు లేకపోతే, నమాజ్ మస్జిద్ లోపల కూడా చేయవచ్చు.

మృతుడు ఏ ఇమామ్ వెనుక నిలబడి నమాజ్ చేస్తుండేవాడో ఆ ఇమామ్ చేతే జనాజా నమాజ్ చేయిస్తే మంచిది. ఒకవేళ ఆయన కాకపోతే మృతుని దగ్గరి బంధువుచేత చేయించవచ్చు. మరెవరైనా అయితే మృతుని బంధువుల అనుమతి తీసుకోవాలి.

శవాన్ని పూడ్చిపెట్టడం

జనాజా నమాజ్ తర్వాత శవాన్ని పూడ్చిపెట్టడం (ఫర్జెకిఫాయా). అంటే కొందరు ఈ బాధ్యతను నెరవేరిస్తే అందరి మీద నుండి అది తొలగిపోతుంది. లేకుంటే ముస్లిములందరికీ పాపం చుట్టుకుంటుంది.

జనాజా నమాజ్ అయిన వెంటనే జనాజాని సమాధి త్రవ్విన చోటికి తీసుకుపోవాలి. పాలు త్రాగే పసివాని శవం అయితే చేతుల మీదనే తీసుకుపో వచ్చు. అంటే ఒక మనిషి కొంతదూరం తీసుకువెళ్ళిన తర్వాత మరొకరు తీసుకువెళ్ళాలి. అలా సమాధి వరకూ తీసుకు వెళ్ళాలి. పెద్దవాళ్ళ శవం అయితే మంచం మీదగానీ, శవపేటికలోగానీ తీసుకు వెళ్ళాలి. దాని నాలుగు కోడులవైపు నలుగురు మోస్తూ భుజాల మీద పెట్టుకోవాలి. శవాన్ని ఏదయినా బండి మీదగానీ, జంతువు మీదగానీ వేసి తీసుకెళ్ళడం మంచిదికాదు. అయితే గత్యంతరం లేకపోతే అది వేరే విషయం. శవపేటికను మోసే నలుగురూ తమ భుజాలు మార్చుకోవచ్చు. కుడివైపు ముందుభాగం అంటే శవం యొక్క కుడిభుజం వైపున కోడును తన కుడి భుజం మీద మోస్తూ ఉన్న వ్యక్తి కనీసం పది అడుగులు మోయాలి. తర్వాత వెనుక భాగంలోని కుడి కోడును తన భుజంపై మోస్తూ కనీసం పది అడుగులు నడవాలి. ఆ తర్వాత ముందు భాగపు ఎడమ కోడును తన భుజం మీద మోస్తూ కనీసం పది అడుగులు నడవాలి. ఆ తర్వాత వెనుక భాగంలోని ఎడమ కోడును భుజం మీద మోస్తూ పది అడుగులు నడవాలి. ఈ విధంగా నలభై అడుగులు నడవాలి.

జనాజాను తీసుకువెళ్ళేటప్పుడు వేగంగా నడవాలి. అయితే శవం అటూఇటూ కదిలిపోయేంత వేగంగా నడవకూడదు. జనాజాను మోస్తున్న వారు దారిలో ఎక్కడా కూర్చోకూడదు. వెంటవున్నవారు శవానికి ముందువైపు నడవకూడదు. బిగ్గరగా దుఆలు చదవకూడదు.

సమాధి

సమాధి రెండు రకాలు. అవి సందూఖీ, బగ్‌లీ.

భారత దేశంలో సాధారణంగా సందూఖీ సమాధి త్రవ్వబడుతోంది. దాని పద్ధతి, ముందు ఒకగొయ్యి తవ్వుతారు. ఆ గోతిలోనే మరొక చిన్న గొయ్యి తవ్వుతారు. ఈ చిన్నగోతిలో శవాన్ని ఉంచి దానిమీద నాపరాళ్ళు కాని, రాతి

పలకలుగాని పరచి ఆ రాళ్ళ సందుల్ని తడిమట్టితో మూసివేస్తారు. దానిమీద మట్టి పోస్తారు. ఈవిధంగా పెద్దగొయ్యి కూడా మట్టితో నిండిపోయి కొంత మట్టి అదనంగా ఉంటుంది. ఇప్పుడాగొయ్యి మట్టిదిబ్బలా కన్పిస్తుంది.

బగ్లీ సమాధి కోసం ముందు ఒక లోతైన గొయ్యి తవ్వుతారు. అందులో లోపలి వైపు ఒక అరలాగా తవ్వుతారు. ఈ అరలో శవం పట్టేంత ఖాళీ ఉంటుంది. దీన్ని గోతిలో ఖిబ్లావైపు తవ్వుతారు. (ఆ అరలో శవాన్ని ఉంచి పైన రాతిపలకలు పరచి ఆపైన మట్టి వేస్తారు)

సమాధి బగ్లీ అయినా, సందూఖీ అయినా శవం ఎత్తులో కనీసం సగం లోతు ఉండేలా త్రవ్వబడుతుంది. దైవప్రవక్త (సల్లం)కు బగ్లీ సమాధి అంటే ఇష్టం. అయితే బగ్లీ సమాధి కోసం గట్టినేల అవసరం. మెత్తని మట్టి అయితే బగ్లీ పూడుకుపోయే ప్రమాదం ఉంటుంది.

శవాన్ని చెక్క, రాయి లేక ఇనుముతో చేసిన పెట్టెలో పెట్టి కూడా పూడ్చవచ్చు. అటువంటప్పుడు ఆ పెట్టెలో కొంతమట్టి పరచాలి.

ఖననం చేసే పద్ధతి

జనాజా ప్రజల భుజాలపై నుండి నేలపై దించనంతవరకు మిగిలిన వారు కూర్చోకూడదు. శవపేటికను సమాధికి ఖిబ్లావైపుండేలా దించాలి. సమాధి లోకి దిగేవారు కూడా ఖిబ్లా వైపుకు తిరిగి శవానికి ఎదురుగా నిలబడాలి.

శవం స్త్రీది అయితే శవాన్ని సమాధిలోకి అందుకునేవారు ఆ స్త్రీకి ముహ్రిమ్ (ఆమెతో వివాహానికి నిషిద్ధులు) అయినవారై ఉండాలి. శవాన్ని దించేటప్పుడు ఒక దుప్పటితో పరదా చెయ్యాలి. తద్వారా ముహ్రిమ్ కానివారి ఎదుట ఆ స్త్రీకి పరదాకు భంగం కలక్కూడదు.

శవాన్ని సమాధిలోకి దింపేవారు ముగ్గురు లేదా నలుగురు కావచ్చు. శవాన్ని సమాధిలోకి దింపేటప్పుడు "బిస్మిల్లాహి వ అలా మిల్లతి రసూలిల్లాహ్" అని పఠించాలి. కఫన్‌కు కట్టిన తాడు విప్పివేయాలి. తర్వాత శవాన్ని ముఖం

ఖిబ్లావైపు ఉండేలా చేయాలి.ఆ తర్వాత సమాధిని ఇటుకలతో మూసేయాలి. రాతిపలకలు లేదా కొయ్యపలకలు కూడా వాడవచ్చు.

ఇటుకలు లేదా రాతిపలకలు పరచిన తర్వాత సమాధి తవ్విన మట్టినే వాటిపై వేయాలి. సమాధిని చదును చేయకుండా ఒంటె మూపురంలా కాస్త ఎత్తుగా ఉండాలి. నేలమట్టానికి ఒక జానెడు లేదా కొంచెం ఎక్కువ ఎత్తుకన్నా ఎక్కువ ఉండకూడదు. సమాధిని పక్కా నిర్మాణం చేయకూడదు.

సమాధిలో మట్టి వెయ్యడం

సమాధిలో మట్టి పోసేటప్పుడు తలభాగం నుండి మొదలుపెట్టాలి. రెండు చేతులనిండా మట్టి తీసుకుని మూడు దోసిళ్ళు మట్టి పోయాలి. మట్టి పోసేటప్పుడు మొదటిసారి "మిన్హా ఖలఖ్ నాకుమ్" (ఈ మట్టితోనే నిన్ను మేము పుట్టించాము) అని, రెండోసారి మట్టి పోస్తూ "వ ఫీహా నుయీదుకుమ్" (ఈ మట్టిలోనే నిన్ను వాపసు చేస్తున్నాం) అని, మూడవసారి మట్టిపోస్తూ "వ మిన్హా నుఖ్రిజుకుమ్ తారతన్ ఉఖ్రా (తిరిగి మేము నిన్ను ఈ మట్టినుండే లేపుతాము) అని పలకాలి. తర్వాత సమాధిపై నీళ్ళు చల్లాలి.

పూడ్చిన తర్వాత

పూడ్చడం అయిపోయిన తర్వాత సమాధి తలవైపు ఎదురుగా నిలబడి ఫాతిహా సూరాను పూర్తిగా, బఖరా సూరాలోని మొదటి ఆయత్ నుండి 'ముఫ్లిహూన్' వరకు చదవాలి. తర్వాత కాళ్ళవైపు నిలబడి బఖరా సూరాలోని ఆఖరి ఆయత్ 'ఆమనర్రసూలు' నుండి సూరా చివరి వరకు చదవాలి. ఆ తర్వాత సమాధి దగ్గర కాస్సేపు నిలబడి మృతుని పాపమన్నింపు కోసం దుఆ చేయాలి. అల్లాహ్ ఇతడిని దైవదూతల ప్రశ్నలకు సరైన జవాబులిచ్చే భాగ్యం ప్రసాదించమని దుఆ చేయాలి. పూడ్చిన తర్వాత సమాధి తలవైపున, కాళ్ళ వైపున చదవబడే ఆయతులు ఈ క్రింద ఇవ్వబడుతున్నాయి.

తల భాగాన

"అవూజు బిల్లాహి మినష్షయ్‌తా నిర్రజీమ్. బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్. అల్‌హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్. అర్రహ్మానిర్రహీమ్. మాలికి యౌమిద్దీన్ ఇయ్యాక నాబుదు వఇయ్యాక నస్తయీన్. ఇహ్‌దినస్సిరాతల్ ముస్తఖీమ్. సిరా తల్లజీన అన్‌అమ్త అలైహిమ్, గైరిల్ మగ్జూబి అలైహిమ్ వలజ్జాల్లీన్." (ఆమీన్)

అర్థం:- శాపగ్రస్తుడయిన షైతాన్ బారి నుండి మేము అల్లాహ్ శరణు కోరుతున్నాం. అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం. సకల స్తోత్రాలు సకలలోకాల ప్రభువయిన అల్లాహ్ కొరకే. ఆయన అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు, తీర్పుదిన యజమాని. ఓ అల్లాహ్ మేము నిన్నే ఆరాధిస్తున్నాము. సహాయం కొరకు నిన్నే వేడుకుంటున్నాము. మాకు సన్మార్గం చూపించు. నీవు అనుగ్రహించిన వారి మార్గం చూపు. నీవు ఆగ్రహించిన వారి, మార్గ భ్రష్టులయినవారి మార్గం కాదు. ఈ దుఆను స్వీకరించు. (బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం)

అలిఫ్ లామ్ మీమ్. జాలికల్ కితాబు లారైబ ఫీహి, హుదల్లిల్ ముత్తఖీన్ అల్లజీన యూమినూన బిల్ గైబి వ యుఖీమూనస్సలాత వమిమ్మా రజఖ్‌నా హుమ్ యున్‌ఫిఖూన వల్లజీన యూమినూన బిమా ఉన్జిల ఇలైక వమా ఉన్జిల మిన్ ఖబ్లిక వబిల్ ఆఖిరతి హుమ్ యూఖినూన్. ఉలాయిక అలా హుదమ్మి రబ్బిహిమ్ వ ఉలాయిక హుముల్ ముఫ్‌లిహూన్."

అర్థం: అనంత కరుణామయుడు అపార కృపారశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం. అలిఫ్ లామ్ మీమ్. ఇది ఎలాంటి సందేహాలకు తావులేని దైవగ్రంథం. దైవానికి భయపడే వారికి, అగోచర విషయాలను విశ్వసించేవారికి, నమాజ్ స్థాపించేవారికి, మేము ఇచ్చిన దాని నుండి (మా మార్గంలో) ఖర్చు చేసేవారికి, మేము నీపై అవతరింపచేసిన గ్రంథాన్ని, నీకు

పూర్వం గతించినవారిపై అవతరింపచేసిన గ్రంథాలను విశ్వసించేవారికి, ఇంకా పరలోకాన్ని విశ్వసించేవారికీ ఇది మార్గదర్శకం. తమ ప్రభువు చూపిన రుజు మార్గంపై ఉన్నవారు వీరే. ఇటువంటి వారే సాఫల్యం పొందేవారు.

కాళ్ళవైపు నిలబడి చదవబడే ఆయతులు

"ఆమనర్రసూలు బిమా ఉన్జిల ఇలైహి మిర్రబ్బిహీ వల్‌మూమి నూన్ కుల్లున్ ఆమన బిల్లాహి వ మలాయికతిహీ, వ కుతుబిహీ వ రుసులిహీ లా నుఫర్రిఖు బైన అహదిమ్మి ర్రుసులిహీ వఖాలూ సమిఅ్‌నా వ అతఅ్‌నా గుఫ్రానక రబ్బనా వ ఇలైకల్ మసీర్. లా యుకల్లిఫుల్లాహు నఫ్సన్ ఇల్లా వుస్‌అహా లహా మాకసబత్ వ అలైహా మక్‌తసబత్. రబ్బనా లా తుఆఖిజ్‌నా ఇన్నసీనా అవ్ అఖ్తానా, రబ్బనా వలా తహ్‌మిల్ అలైనా ఇస్రన్ కమా హమల్ తహూ అలల్లజీన మిన్‌ఖబ్లినా రబ్బనా వలాతుహమ్మిల్‌నా మాలా తాఖత లనా బిహీ వ అఫుఅన్నా, వగ్‌ఫిర్ లనా, వర్‌హమ్‌నా అన్‌త మౌలానా ఫన్‌సుర్‌నా అలల్ ఖౌమిల్ కాఫిరీన్."

అర్థం: దైవప్రవక్త, సమస్త ముస్లిములు వారి ప్రభువు తరఫున దివి నుండి అవతరించిన గ్రంథాన్ని విశ్వసిస్తున్నారు. వీరంతా అల్లాహ్‌పై, ఆయన దూతలపై, ఆయన గ్రంథాలపై, ఆయన ప్రవక్తలపై విశ్వాసం కలిగి ఉన్నారు. మేము దైవప్రవక్తల నడుమ విచక్షణ చూపము. మేము విన్నాము. విశ్వ సించాము. ఓ మా ప్రభూ! మమ్ములను క్షమించు. మేము నీ వైపుకే మరల వలసి ఉంది. అల్లాహ్ ఎవరిపైనా వారి శక్తికి మించిన భారం మోపడు. ప్రతి ఒక్కరికీ సత్కార్యాలకు ప్రతిఫలం, పాపాలకు శిక్ష లభిస్తుంది. ఓ మా ప్రభూ! మరపువల్ల మాచే ఏదయినా తప్పు జరిగితే మమ్ములను తప్పు పట్టకు. ఓ ప్రభూ మాకు పూర్వం గతించినవారిపై వేసిన భారం మాపై వేయకు. మేము మోయలేని భారాన్ని మాపై మోపకు. మమ్ములను క్షమించు, అనుగ్రహించు, కరుణించు. మా ప్రభువు నువ్వే! తిరస్కారులకు వ్యతిరేకంగా మాకు సహాయం చెయ్యి.

ఈసాలె సవాబ్ (పుణ్యం అర్పించడం)

మృతునికి పుణ్యం పంపడానికి ఖుర్‌ఆన్ పఠనం చేసిగాని, ఏదయినా పుణ్యకార్యం చేసిగాని పంపవచ్చు. ఇందులో ఎటువంటి తప్పు లేదు. అయితే అది స్వీకరించబడుతుందా? లేదా అన్నది అల్లాహ్ అభీష్టంపై ఉంటుంది.

సమాధుల సందర్శన

పురుషులు అప్పుడప్పుడు సమాధులను దర్శిస్తూ ఉండాలి. మృతుల పాపమన్నింపు కోసం దుఆ చేయాలి. తద్వారా తామూ ఒకరోజు మరణించాల్సి ఉంటుందన్న విషయమూ గుర్తుకు వస్తుంది. స్త్రీలు సమాధుల దగ్గరకు వెళ్ళకూడదు. శ్మశానానికి వెళ్ళే పురుషులు ఈ దుఆ చేయాలి.

"అస్సలాము అలైకుం యా అహ్‌లల్ ఖుబూరి యగ్‌ఫిరుల్లాహు లనా వలకుమ్, అన్‌తుమ్ సలఫునా వనహ్‌ను బిల్ అస్ర్."

అర్థం: సమాధి వాసులారా! మీపై శాంతి కలుగుగాక! అల్లాహ్ మిమ్మల్నీ, మమ్మల్నీ క్షమించుగాక! మీరు మాకన్నా ముందు వెళ్ళారు. మేమూ మీ వెనకే వస్తున్నాం."

మృతుడు విడిచివెళ్ళిన ఆస్తి పంపకం

శవాన్ని పూడ్చి వచ్చిన తర్వాత అతడు వదలిన ఆస్తి పంపకానికి షరీఅత్ ఒక పద్ధతి నేర్పింది. ప్రతి భాగస్వామి వాటాను నిర్ణయించింది. మనిషి మరణించిన తర్వాత అతని ఆస్తి పంపకం విషయంలో గొడవలు పడటం మంచిది కాదు. తాత్సారం చెయ్యకుండా వీలయినంత త్వరగా ఆ ఆస్తిని షరీఅత్ ప్రకారం సక్రమంగా పంపిణీ చేసేయాలి. అప్పుడే హక్కుదారుల హృదయాల్లో కల్మషం చోటుచేసుకోకుండా ఉంటుంది. వివిధ బంధువులకు షరీఅత్ నిర్ణయించిన వాటాల వివరాలు ధర్మవేత్తల నుండి తెలుసుకోవచ్చు.

దైవప్రవక్త (సల్లం) ఉపదేశాలు

(1) "ఇస్లాం స్వీకరించిన వ్యక్తి సాఫల్యాన్ని, విముక్తిని పొందాడు" అని దైవప్రవక్త (సల్లం) సెలవిచ్చారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) తెలిపారు. (ముస్లిం)

(2) "బాబూ! నీవు నీ ఇంటిలో ప్రవేశించినప్పుడు ఇంటివారికి సలామ్ చెయ్యి. ఈ విషయం నీకు, నీ ఇంటివారికీ శుభప్రదమైనది అవుతుంది" అని దైవప్రవక్త (సల్లం) సెలవిచ్చారని హజ్రత్ అనస్ (రజి) తెలిపారు. (తిర్మిజీ)

(3) "మాట్లాడే ముందు సలామ్ చెయ్యాలి" అని దైవప్రవక్త (సల్లం) సెలవిచ్చారని హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖించారు. (తిర్మిజీ)

(4) "పరస్పరం కరచాలనం (ముసాఫా) చేసుకోవాలి. దీని వలన ఈర్ష్య దూరం అవుతుంది" అని దైవప్రవక్త (సల్లం) సెలవిచ్చారని హజ్రత్ అతా (రజి) ఖురాసానీ తెలిపారు.

(5) "జ్ఞానార్జన ప్రతి స్త్రీ, ప్రతి పురుషుని విధి" అని దైవప్రవక్త (సల్లం) సెలవిచ్చారని హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖించారు. (ఇబ్నుమాజ)

(6) "జ్ఞానార్జన కోసం ఇల్లు వదలినవాడు, ఇంటికి తిరిగివచ్చే వరకూ దైవమార్గంలో ఉంటాడు." అని దైవప్రవక్త (సల్లం) సెలవిచ్చారని హజ్రత్ అనస్ (రజి) తెలిపారు. (తిర్మిజీ, దారిమీ)

(7) మలమూత్ర విసర్జన సమయంలో ఖిబ్లావైపు తిరిగి ఉండటాన్ని దైవప్రవక్త (సల్లం) వారించారని హజ్రత్ సల్మాన్ (రజి) చెప్పారు. (ముస్లిం)

(8) "శుద్ధిగా ఉండటం అర్ధ విశ్వాసం" అని దైవప్రవక్త (స) తెలిపారని హజ్రత్ అబీ మాలిక్ అష్అరీ ఉల్లేఖించారు.

(9) "మీలో జుమా నమాజ్ కోసం వచ్చేవారు ముందుగా గుసుల్ (స్నానం) చేయాలని దైవప్రవక్త (సల్లం) ఆదేశించారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) చెప్పారు.

(10) "భోజనానికి కూర్చున్నవాడు భోజనానికి ముందు దైవనామం స్మరించడం మరచిపోతే తర్వాత అతడు 'బిస్మిల్లాహి అవ్వాలుహూ వ ఆఖిరుహూ' (నేను భోజనం ఆరంభం నుండి ఆఖరి వరకు అల్లాహ్ పేరును స్మరించాను) అని చెప్పాలని దైవప్రవక్త (సల్లం) ఉపదేశించినట్లు హజ్రత్ ఆయిషా (రజి) తెలిపారు. (తిర్మిజీ, అబూదావూద్)

(11) "భోజనం అయిన తర్వాత కృతజ్ఞత ప్రకటించినవాడు సహనం కల ఉపవాసి వంటివాడు" అని దైవప్రవక్త (స) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు. (తిర్మిజీ, ఇబ్నుమాజా, దార్మి)

(12) దైవప్రవక్త (సల్లం) భోజనం ముగించిన తర్వాత "అల్హమ్దు లిల్లాహిల్లజీ అత్అమనా వ సఖానా వ జఅలనా మినల్ ముస్లిమీన్" (మాకు భోజనం ప్రసాదించి, త్రాగించి, మమ్ములను ముస్లింలుగా చేసిన దేవుడు ఎంతో ప్రశంసనీయుడు) అని పలికేవారని హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) తెలిపారు.

(తిర్మిజీ, అబూదావూద్, ఇబ్నుమాజ)

(13) "నీవు ఒంటెలా ఏకబికిన నీరు త్రాగకు. రెండు మూడుసార్లు శ్వాస తీసుకుని త్రాగు. త్రాగడం ప్రారంభించేముందు బిస్మిల్లాహ్ అని పలుకు. మరోసారి నోటికి పాత్ర అందిస్తే అల్హమ్దు లిల్లాహ్ అని

పలుకు" అని దైవ ప్రవక్త (సల్లం) సెలవిచ్చారని హజ్రత్ ఇబ్నుఅబ్బాస్ (రజి) తెలిపారు. (తిర్మిజీ)

(14) "దైవప్రవక్త (సల్లం) నీరు త్రాగేటప్పుడు మధ్యలో మూడు శ్వాసలు పీల్చేవారు" అని హజ్రత్ అనస్ (రజి) తెలిపారు." (బుఖారి, ముస్లిం)

(15) "త్రాగే నీటిలో వూదడాన్ని దైవప్రవక్త (సల్లం) వారించేవారు" అని హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) అన్నారు. (తిర్మిజీ, దార్మి)

(16) "అందరూ కలిసి తినండి. వేర్వేరుగా తినకండి. సామూహికంగా భుజించడంలో శుభం ఉంది" అని దైవప్రవక్త (సల్లం) ఆదేశించారని హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) అన్నారు. (ఇబ్నుమాజ)

(17) "వృథా ఖర్చు, అహంకారం లేనంత వరకూ ఎలాంటి వస్త్రాలైనా ధరించవచ్చు" అని దైవప్రవక్త (సల్లం) ప్రవచించారని హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ (రజి) తన తండ్రి నుండి, ఆయన తన తాత నుండి ఉల్లే ఖించారు. (అహ్మద్, నసాయి, ఇబ్నుమాజ)

(18) "స్త్రీలవలె వస్త్రధారణ చేసే పురుషుల్ని, పురుషులవలె వస్త్ర ధారణ చేసే స్త్రీలనూ దైవప్రవక్త (సల్లం) శపించారని హజ్రత్ అబూహురైరా (రజి) తెలియజేశారు." (అబూదావూద్)

(19) "ఇతర జాతుల వారిని అనుకరించినవాడు ఆ జాతికి చెందిన వాడి క్రిందే లెక్క" అని దైవప్రవక్త (సల్లం) సెలవిచ్చారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) అన్నారు. (అహ్మద్, అబూదావూద్)

(20) "మీలో సద్గుణసంపన్నుడే గొప్ప పుణ్యాత్ముడ"ని దైవప్రవక్త (స) తెలిపారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) అన్నారు. (బుఖారీ, ముస్లిం)

(21) "కర్మల పర్యవసానం సంకల్పాలపై ఆధారపడి ఉంటుంద"ని దైవప్రవక్త (సల్లం) సెలవిచ్చారని హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) చెప్పారు. (బుఖారీ, ముస్లిం)

(22) "తల్లిదండ్రుల వైపు ప్రేమతో, కారుణ్యంతో చూసిన కుమారుడి ప్రతి చూపుకీ అల్లాహ్ అతని కర్మపత్రంలో ఒక ఉత్తమ హజ్ పుణ్యాన్ని రాస్తాడు" అని దైవప్రవక్త సల్లం సెలవిచ్చారని హజ్రత్ ఇబ్ను అబ్బాస్ (రజి) తెలిపారు.

అల్లాహ్ - ఆయన తప్ప ఆరాధ్య దైవం ఎవ్వడూ లేడు. సకల చరాచర సృష్టికి మూలాధారం అయిన ఆయన సజీవుడు, నిత్యుడు, అనంతుడు. ఆయన నిదురపోడు, ఆయనకు కునుకూ రాదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయనదే.
(దివ్యఖుర్ఆన్-2:255)

సర్వమానవాళి మార్గదర్శకం కొరకు అల్లాహ్ పంపిన చివరి గ్రంథం

దివ్యఖుర్ఆన్

అనుదినం అధ్యయనం చేయండి.

తెలుగులో దివ్యఖుర్ఆన్, మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) జీవిత చరిత్ర, ఆయన (స) ప్రవచనాలు, ఇంకా వివిధ అంశాలపై ఇస్లామీయ సాహిత్యానికై సంప్రదించండి :

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్
సందేశభవనం, లక్కడ్‌కోట్, హైదరాబాద్-500 002.
ఫోన్: 24564583
Website: www.teluguislamiclit.org
e-mail: tiphyderabad@rediffmail.com